సాక్షి నంద్యాల
మంగళవారం, 14 జనవరి, 2025



హరిదాసు వేషధారణలో..

శ్రీగిరికి బ్రహ్మోత్సవ వైభవం

- శ్రీశైలంలో దేదీప్యమానంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు
- కైలాస వాహనంపై ఆది దంపతులు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు



కైలాస వాహనంపై కొలువైన భ్రామరీ సమేత మల్లన్నకు గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సకల భోగ సౌభాగ్యాలనిచ్చే భోగి పర్వదినమైన సోమవారం పార్వతీ సమేత మల్లికార్జునస్వామి కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలతో అలంకార మండపం వద్దకు తోడ్కొని వచ్చి కైలాసవాహనంపై ఉంచి వేద పండితులు, అర్చకులు వాహన పూజలు జరిపారు. అనంతరం కైలాస వాహనంపై కొలువైన ఆది దంపతులను ఆలయ ప్రదక్షిణ చేయించి క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. కోలాటం, హరిదాసు, శివ పార్వతుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

నేడు నందివాహనసేవ..

సంక్రాంతి రోజు మంగళవారం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులు నందివాహనంపై దర్శనమివ్వనున్నారు. ఆలయ ప్రాంగణంలోని నిత్యకల్యాణ మండపంలో గంగాపార్వతీ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

చెంచులకు ప్రత్యేక ఆహ్వానం..

స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవానికి చెంచులను ప్రత్యేకంగా దేవస్థానం ఆహ్వానించింది. చెంచులు పార్వతీదేవిని తమ కూతురుగా, మల్లికార్జునస్వామివారిని అల్లుడిగా భావించి సంక్రాంతి రోజున వారి సంప్రదాయంలో మల్లన్న పార్వతీ సమేత కల్యాణం నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

రుణాల రికవరీ కోసం ప్రత్యేక టీమ్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పేరుకపోయిన బకాయిలను రికవరీ చేసేందుకు 4 ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. జాయింట్ కలెక్టర్, డీసీసీబీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ నవ్య ఆదేశాల మేరకు టీ ములు ఏర్పాటు చేస్తూ సీజీవో విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సహకార కేంద్రబ్యాంకులో రూ.250 కోట్ల బకాయిలు ఉన్నాయి. బకాయిలు ఎక్కువగా ఉన్న ఆదోని, పత్తికొండ, ఆలూరు బ్రాంచీలకు ఏజీఎం శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో టీమ్ ఏర్పాటు అయింది. డోన్, క్రిష్ణానగర్, కోడుమూరు తదితర బ్రాంచీలకు చీఫ్ మేనేజర్ జయప్రకాశ్‌బాబు నేతృత్వంలో టీమ్ ఏర్పాటైంది. ఒక్కో టీమ్‌లో ఆరుగురు అధికారులు ఉంటారు. మార్చి నెల చివరి వరకు ఈ టీమ్‌లు రికవరీలపైనే దృష్టి సారిస్తాయి. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పనిచేసే మహిళ అధికారులు, ఉద్యోగులతో ప్రత్యేకంగా మరో రెండు టీమ్‌లు ఏర్పాటయ్యాయి. ఈ నెల 16 నుంచి ఈ టీమ్‌లు రికవరీలో చురుగ్గా పాల్గొంటాయి.

అన్నప్రసాదానికి విరాళం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన కె.శ్రీనివాసరావు రూ.1,00,116 విరాళాన్ని దేవస్థాన ఏఈవో జి.స్వాములకు అందజేశారు. విరాళాన్ని అందించిన దాతకు దేవస్థానం తరపున సత్కరించారు.

అదిగదిగో సంగమేశ్వరుడి ఆలయ గోపురం



కొత్తపల్లి: శ్రీశైలం జలాశయంలో రోజు రోజుకి నీటి మట్టం తగ్గుతుండటంతో సంగమేశ్వరుడు జలాధివాసం వీడుతున్నాడు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 885 అడుగుల నుంచి 857 అడుగులకు చేరుకుంది. దీంతో కృష్ణా జలాల నుంచి ప్రాచీన సంగమేశ్వర ఆలయ గోపురం పూర్తిగా బయటపడింది. ముక్కోటి సోమవారం సందర్భంగా ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ ఆలయ శిఖరానికి కృష్ణాజలాలతో అభిషేకం, పాలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, విశేష పూజలు చేశారు.

శ్రీశైలంలో 99 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో రోజురోజుకు నీటి నిల్వలు తగ్గుతున్నాయి. సోమవారం సాయంత్రం జలాశయంలో 98.9024 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 857.60 అడుగులకు చేరుకుంది. ఆదివారం నుంచి సోమవారం వరకు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 0.879 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 1,876 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు.అలాగే బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,722, మల్యాల ఎత్తిపోతలకు 338, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 490, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

ఫలరాజుపై మంచు పంజా!

- నీరుగారుతున్న మామిడి రైతుల ఆశలు
- వాతావరణ మార్పులతో విరబూయని పూత
- చలి వల్ల ఆలస్యమవుతున్న సైనం
- పంట దిగుబడిపై పడనున్న ప్రభావం
- ఆందోళనలో రైతన్నలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వేలకు పైగా ఎకరాల్లో మామిడి తోటలు

మామిడి రైతుకు దిగుబడి దిగులు పట్టుకుంది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు పంటకు ప్రతికూలంగా మారింది. జనవరి మాసం ప్రారంభమై పక్షం రోజులైనా ఆశించిన మేర పూత రాలేదు. ఏటా డిసెంబర్ చివరికల్లా మామిడిచెట్లు పూతతో కళకళలాడేవి. ఈసారి చలి తీవ్రత, పొగమంచు ప్రభావంతో ఆ పరిస్థితి కనిపించకపోవడంతో ఎన్నో ఆశలతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



ఇక్కడ కనిపిస్తున్న మామిడి తోట కర్నూలు మండలం శివరామపురం గ్రామం రైతుది. ఎలాగైనా ఈసారి మంచి దిగుబడులు సాధించాలని పైరు చీడ పీడల బారిన పడకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. వేలాది రూపాయలు పెట్టి ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేశాడు. చివరకు చలి తీవ్రత, పొంగమంచు ఆశలపై నీళ్లు చల్లాయి. ఇప్పటి వరకు చెట్లకు పూత పూయలేదు.



ఇక్కడ పూత రాలిపోయి కనిపిస్తున్న మామిడి పంట బనగానపల్లెకు చెందిన సజ్జాద్‌హుస్సేన్‌ది. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు, తుఫాన్ల ప్రభావంతో పెరిగిన మంచుతో బూడిద తెగులు సోకింది. నివారణకు పలు రకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చెట్టుపై అక్కడక్కడ కొంత పూత కనిపిస్తున్నా చివరి వరకు నిలవదని, నిలిచినా కాయ సరిగ్గా ఉండదని రైతు వాపోతు న్నాడు.

కర్నూలు(అగ్రికల్చర్/బనగానపల్లె రూరల్): ఈసారి వ్యవసాయం రైతులకు కలిసి రాలేదు. తొలుత అధిక వర్షాలు, తర్వాత వర్షాభావంతో ఖరీఫ్ నిరాశకు గురి చేస్తే, వరుస తుఫానులు రబీ ఆశలను దెబ్బతీశాయి. ఈ క్రమంలో కొందరు రైతులు మామిడి (ఫలరాజు) తోటలపై నమ్మకం పెంచుకుంటే ప్రస్తుతం నెలకొన్న చలి తీవ్రత ప్రతికూలంగా మారింది. మామిడి తోటలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా కూడా ఒకటి. ఈ పంటకు పెట్టింది పేరు బనగానపల్లె ప్రాంతం. బనగానపల్లె, అవుకు, సంజామల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, పాణ్యం, వెల్దుర్తి, బేతంచెర్ల తదితర మండలాల్లో భారీగా మామిడి తోటలు ఉన్నాయి. దీనికి తోడు గత ప్రభుత్వ ప్రోత్సాహంతో 2019 నుంచి 2024 వరకు ఉమ్మడి జిల్లాలో మామిడి తోటలు విస్తారంగా అభివృద్ధి చెందాయి. ఒకవైపు ఉపాధి నిధులతో 100 శాతం సబ్సిడీ ఇవ్వడం, మరోవైపు ఉద్యాన శాఖ ఆకర్షణీయమైన రాయితీల ద్వారా రైతులను ప్రోత్సహించడంతో మామిడి తోటల సాగు భారీగా పెరిగింది.

జిల్లాలో విభిన్న పరిస్థితి

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో మామిడి పూత కొంత కనిపిస్తుండగా..తూర్పు ప్రాంతంలో ఇంకా పట్టే దశలోనే ఉంది. ఈ విభిన్న పరిస్థితికి వాతావరణంలో మార్పే కారణంగా కనిపిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు 10-11 డిగ్రీలకు పడిపోయాయి. ఈ వాతావరణం మామిడికి ఇబ్బందికరంగా మారింది. చల్లని వాతావరణం ఉంటే తోటల్లో కొత్త చిగుళ్లు వస్తాయి. నేడు పలు ప్రాంతాల్లో చలి ఎక్కువగా ఉంది. ఈ కారణంగా మామిడిలో కొత్త చిగుళ్లు కనిపిస్తున్నాయి. పత్తికొండ, దేవనకొండ. తుగ్గలి, గూడూరు, సి.బెళగల్ ప్రాంతాల్లో 50 శాతం వరకు మామిడి పూత వచ్చింది. వెల్దుర్తి, ఓర్వకల్లు, బేతంచెర్ల, అవుకు, బనగానపల్లె, కృష్ణగిరి, కల్లూరు, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల్లో 30 నుంచి 40 శాతం వరకే పూత వచ్చింది. మామూలుగా అయితే జనవరి మొదటి పక్షం లోపు అన్ని ప్రాంతాల్లోని మామిడిలో 80 శాతంపైగా పూత రావాలి. వాతావరణం చల్లగా ఉండటం, పొగ మంచు ప్రభావం ఎక్కువగా ఉండటం ద్వారా పలు ప్రాంతాల్లో పూత ఆలస్యమవుతోంది. ఒక తోట లో 100 చెట్లు ఉంటే ఇందులో 35-40 శాతం చెట్లు పూతకు వచ్చాయి. మిగిలిన చెట్లలో పూత ఆలస్యమవుతోంది. జనవరి మొదటి పక్షం గడుస్తున్నా ఆశించిన మేర పూత పట్టకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు చలి తీవ్రత వల్ల తేనెమంచు, పురుగుల బెడద పెరుగుతుండటంతో మామిడి రైతులు కలవరం చెందుతున్నారు.

వచ్చిన పూత నిలిచేనా...

కొన్ని ప్రాంతాల్లో పూత ఆశాజనకంగా వచ్చినప్పటికీ నిలిస్తేనే కాపు బాగుంటుంది. సంక్రాంతి తర్వాత ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు పూత పిందె రాలిపోతుంది. 2022-23, 2023-24 సంవత్సరాల్లో ఆరంభంలో పూత బాగానే వచ్చినప్పటికీ తర్వాత ఎండల ప్రభావంతో 60 శాతంపైగా రాలిపోయింది. ఈ సారి కొన్ని ప్రాంతాల్లో పూత విశేషంగా వచ్చినప్పటికి ఎంత వరకు నిలిచి కాపుగా మారుతుందనేది ప్రశ్నార్థకం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15,000 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.ఇందులో కర్నూలు జిల్లాలో 4848 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 10,167 ఎకరాల్లో మామిడి తోటలు అభివృద్ధి చెందాయి. ఇప్పటి వరకు 40 శాతం తోటల్లో 50 శాతంపైగా పూత వచ్చింది. 50 శాతం తోటల్లో 30 శాతం వరకే పూత వచ్చింది. 10 శాతం తోటల్లో ఇంకా పూత రాలేదు. పూత రావడంలో హెచ్చు తగ్గులుండటానికి వాతావరణ పరిస్థితులే కారణమని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అభివృద్ధి చెందిన మామిడిలో 70 నుంచి 80 శాతం వరకు బేనిసా ఉంటోంది. బేనిసా చెట్లు ఒక ఏడాది బాగా కాపు ఇస్తే... మరుసటి ఏడాది కాపునకు రావు. మామిడిలో చాలా వరకు పూత రాకపోవడానికి ఇది కూడా ఒక కారణమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే విరబూసిన పూతను బట్టి జిల్లాలో మామిడి కొనుగోలు యత్నాలు జరుగుతాయి. పూత బాగా నిలిస్తే ఎకరాకు 7 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి వాతావరణం మామిడి పంటకు అనుకూలంగా లేకపోవడంతో భారీగా దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గతేడాది పూత బాగుండేది



నాకు రెండు ఎకరాల్లో మామిడి తోట ఉంది. గతంలో ఈ సమయానికి మామిడి చెట్లకు పూత బాగా ఉండేది. ఇప్పటి వరకు ఆశించిన మేర పూత లేదు. తేమశాతం ఎక్కువ కావడామో లేక వాతావరణ ప్రభావమో తెలియదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాను. పంట రాకపోతే ప్రభుత్వం ఆదుకోవాలి. – కురువ శంకర్, మామిడి రైతు, పూడురు,కర్నూలు మండలం

దిగుబడిపై ప్రభావం



నేను బనగానపల్లె, పాణ్యం, బేతంచర్ల మండలాల్లో సుమారు 14 ఎకరాల తోటలను రూ.3 లక్షల కౌలు ఇచ్చి తీసుకున్నాను. దీనికితోడు మందుల పిచికారీ తదితర వాటి కోసం లక్షకు పైగా ఖర్చు చేశాను. సాధారణంగా ఈ సమయానికి పూత వచ్చి ఉండాలి. ఆలస్యం కావడంతో దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. – పాంషా, మామిడి తోటల కౌలు రైతు, బనగానపల్లె

మామిడిలో పూతరాకపోతే ఇలా చేయాలి



పలు ప్రాంతాల్లో మామిడిలో పూత రావడం ఆలస్యమవుతోంది. పూత రాని పక్షంలో 13-0-45 రసాయన ఎరువు 10 గ్రాములు, 3 గ్రాముల సల్ఫర్, 1.6 ఎంఎల్ మోనో క్రోటోపాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీంతో పాటు పూత రాని తోటల్లో పొగపెట్టాలి. ఇలా చేయడం ద్వారా పూత వచ్చే అవకాశం ఉంది. మరో 10-15 రోజుల్లో అన్ని ప్రాంతాల్లోని అన్ని తోటల్లో పూత వచ్చే అవకాశం ఉంది. పూత వచ్చిన తర్వాత చెట్లకు ఎరువులు వేసి తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి. పూత వచ్చిన తోటల్లో చీడ పీడల యాజమాన్యంలో భాగంగా సాఫ్-2 జీఎం, క్లోరోఫైరిఫాస్ 2 ఎంఎల్, బోరాన్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చి పూత ఉన్నట్లైతే ఇమిడాక్లోప్రిడ్ 0.3 గ్రాములు, హెక్సాకొనజోల్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాల్సి ఉంది. – పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

కమనీయం.. గోదాదేవి కల్యాణోత్సవం



ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న దృశ్యం



తాళి చూపుతున్న అర్చకులు

ఆళ్లగడ్డ: జయజయ నారసింహ నామ సంకీర్తనలు.. వేద పండితుల వేదోక్త మంత్ర పఠనములు.. ఆస్థాన విద్వాంసుల మంగళకర వాయిద్యాల నడుమ శ్రీ అహోబిల లక్ష్మీనరసింహుడు, గోదాదేవీ పరిణయ వేడుక సోమవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో వైభవంగా జరిగింది. ఈ తంతుతో నెల రోజులుగా జరుగుతున్న ధనుర్మాస పూజలు శాస్త్రోక్తంగా ముగిశాయి. పూజల్లో భాగంగా వేకువ జామున దిగువ అహోబిలంలో కొలువైన మూలవిరాట్ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లతో పాటు గోదాదేవిని సుప్రభాతసేవతో మేలుకొలిపి ప్రత్యేక ధనుర్మాస, భోగి పూజలు నిర్వహించారు. అనంతరం గర్భగుడి ఎదురుగా యాగశాలలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామిని, గోదాదేవికి ఎదురుగా కొలువుంచి వేద పండితులు నవకలశ స్థాపన, అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆండాల్ అమ్మవారి సన్నిధికి తోడ్కొని వచ్చి శ్రీ గోదాదేవి, ప్రహ్లాదవరదుల కల్యాణం నిర్వహించారు. అనంతరం పల్లకీల్లో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదం కాదు.. హత్యాయత్నం

- డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కేసులో కుట్ర కోణం
- ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడి పాత్రపై అనుమానాలు

డోన్: మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. నిన్నటి వరకు అందరూ రోడ్డు ప్రమాదంగా భావిస్తున్న కేసులో కుట్ర కోణం వెలుగులోకి వచ్చింది. ఓ భూమి వివాదంలో అతడిని అంతమొందించాలనే కుట్రలో భాగంగా పథకం ప్రకారం వాహనంతో ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ నెల 6వ తేదీ స్థానిక గుత్తి రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్‌ను గుర్తు తెలియని కారు ఢీ కొంది. ఈ కేసులో డోన్ పోలీసులు ఎట్టకేలకు పురోగతి సాధించారు. పట్టణంలోని హరికిషన్‌కు సంబంధించిన భూ వివాదంలో అతని ప్రత్యర్థులు ఆళ్లగడ్డకు చెందిన టీడీపీ నాయకుడు ఆశ్రయించారు. ఈ క్రమంలో జరిగిన సంఘటన రోడ్డు ప్రమాదం కాదు.. హత్యాయత్నమేనని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ రోజు గాయపడిన హరికిషన్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదు. అయితే ప్రసార మాధ్యమాల్లో వార్త వైరల్ కావడంతో పోలీసులు 376 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుత్తి రోడ్డులో ఉన్న పలు దుకాణాల బయట ఉన్న సీసీ కెమెరాలను గత రెండు రోజులుగా క్షుణంగా పరిశీలించిన పోలీసులు ఢీకొన్న వాహనం ఆళ్లగడ్డకు చెందినదిగా నిర్ధారించినట్లు తెలిసింది. ఈ క్రమంలో హరికిషన్‌తో భూ వివాదం ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా ఆళ్లగడ్డకు చెందిన ఒక టీడీపీ నాయకుడి సహకారంతో హరికిషన్‌ను హత మార్చేందుకు కుట్ర పన్ని, గుర్తు తెలియని వాహనంతో ఢీ కొట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. అయితే ఈ సంఘటన గురించి సీఐ ఇంతియాజ్‌ను వివరణ కోరగా కేసు విచారణలో ఉందని తెలిపారు.

నంద్యాల ఏఎస్పీగా మందా జావళి ఆల్ఫోన్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీగా మందా జావళి ఆల్ఫోన్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆల్ఫోన్ విజయనగరంలో ట్రైనీ ఐపీఎస్‌గా శిక్షణ తీసుకొని ఇక్కడికి వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా డీఎస్పీ పదవీ నుంచి పదోన్నతి పొందిన యుగంధర్‌బాబు విధులు నిర్వహిస్తున్నారు.

నిరసన మంట

- విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి తగలబెట్టిన వామపక్ష నాయకులు



నంద్యాల.. భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్)/గోస్పాడు: విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు హోరెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం తెల్లవారు జాము నుంచే పెరిగిన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో తగలబెట్టారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచబోనని చెప్పిన చంద్రబాబునాయుడు.. అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లో వేల కోట్ల భారం వేయడం తగదని, పెరిగిన విద్యుత్ బిల్లులతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద, గోస్పాడు మండలం పసురపాడు వద్ద జరిగిన నిరసన కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, పుల్లా నరసింహ, బాలవెంకట్, గోస్పాడు మండల కార్యదర్శి చెన్నయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

కర్నూలు: నగర శివారులోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న సాయికిరణ్ (23) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 9 నెలల క్రితం వివాహమైంది. సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆర్థిక సమస్యలతో కొంతకాలంగా ఇబ్బంది పడేవాడు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో పని నుంచి ఇంటికి వచ్చిన సాయికిరణ్ గదిలోకి వెళ్లి బెడ్ రూమ్‌లో తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. బాత్‌రూమ్‌లో ఉన్న తండ్రి శ్రీనివాసులు గమనించి ఇరుగు పొరుగు సాయంతో తలుపులు బద్దలు కొట్టి ఉరికి వేలాడుతున్న సాయికిరణ్‌ను కిందకు దించి వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షలు జరిపి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటకాలువలో పడి వ్యక్తి మృతి


మృతిచెందిన నిమ్మ రాజేష్

వెలుగోడు: మండల పరిధిలోని రేగడ గూడూరు గ్రామ సమీపంలో అదుపుతప్పి పంట కాలువ కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పాములపాడు మండలం వానాల గ్రామానికి చెందిన నిమ్మ రాజేష్‌కుమార్(35) వరి నారు కోసం మోటార్ సైకిల్‌పై వెలుగోడుకు బయలుదేరాడు. మార్గమధ్యలో అదుపుతప్పి పంట కాలువ కుంటలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పాణ్యం: మండల కేంద్రానికి చెందిన తులసి(32) కల్లాపి పొడి తాగి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. సోమవారం ఉదయం అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

చెంచుల గుడిసెలు దగ్ధం


శిఖరేశ్వరం వద్ద కాలిపోతున్న గుడిసెలు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని శిఖరేశ్వరం వద్ద ఉన్న చెంచుగూడెంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. సమీపంలో వేసుకున్న చలిమంటల నిప్పురవ్వలు గుడిసెలపై పడటంతో ప్రమాదం చోటుచేసుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని చెంచులు కోరారు.

ఆలూరు చెరువులో రాళ్లు మొలిచెన్!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పాగా వేసేస్తున్నారు. తాజాగా చెరువు ఆలూరు చెరువులో దర్జాగా ప్లాట్లు వేసి నంబరాళ్లు నాటారు. నీటితో కళకలాడాల్సిన చెరువులో ఒక పక్క కాసులకు కక్కుర్తి పడి మట్టిని తరలించి వ్యాపారం చేసుకుంటుండగా మరో పక్క ప్లాట్లు వేసి యథేచ్ఛగా ఆక్రమణకు పాల్పడుతున్నా మైనర్ ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. – ఆలూరు రూరల్


ఆలూరు చెరువులో భూమి ఆక్రమించి హద్దు రాళ్లు పాతిన దృశ్యం

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జా
- కాళీ జాగా కనిపిస్తే పాగా వేస్తున్న అధికార పార్టీ నాయకులు
- తాజాగా ఆలూరు చెరువులోనూ ప్లాట్లు వేసిన ఘనులు
- పట్టించుకోని మైనర్ ఇరిగేషన్ అధికారులు

ఆలూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ భూమి వందల ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఆలూరు చెరువు సైతం కబ్జాదారుల కబంద హస్తాల్లోకి వెళ్లిపోతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సర్వే నంబర్ 748లో 155.71 ఎకరాల్లో చెరువు ఉంది. కొన్నేళ్లుగా సరైన వర్షాలు లేక పోవడం, చెరువు చుట్టూ గృహాలు నిర్మించడంతో 30 శాతం చెరువు భూమి ఆక్రమణకు గురైంది. తాజాగా చెరువులో ఏకంగా నంబర్ రాళ్లు నాటి ప్లాట్లు చేయడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. ఇప్పటికే ఈ చెరువులోని 30 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. ఇందులో భాగంగానే సీఎల్ఆర్‌సీ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న చెరువులోని 50 సెంట్ల భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రైవేటు స్థలం మాదిరి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. చెరువు భూమి ప్రైవేటు లే అవుట్లను తలపిస్తోంది. విలులైన ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ప్లాట్లు వేసి ఆక్రమిస్తున్నా అధికారులు కళ్లుమూసుకున్నారు. సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా



కూటమి అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. ఆలూరు చెరువులో రాళ్లు పాతి భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. రెండు రోజులుగా చెరువులో ప్లాట్లు వెలుస్తున్నా మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం దారుణం. చెరువు భూమి ఆక్రమణపై ఇరిగేషన్ డీఈ, సీఐ దృష్టికి తీసుకెళ్లాను. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.
– విరూపాక్షి, ఎమ్మెల్యే

చర్యలు తీసుకుంటాం



ఆలూరు చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు భూ కబ్జా చేసి రాళ్లు పాతినట్లు నా దృష్టికి వచ్చింది. వీఆర్వో, సిబ్బందితో చెరువు భూమి ఆక్రమణపై తనిఖీ చేయించాను. రాళ్లు పాతి హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. చెరువులో భూ ఆక్రమణ జరిగినట్లు మైనర్ ఇరిగేషన్ అధికారులకు తెలియజేశాం. చెరువు భూమి ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– గోవింద్ సింగ్, తహసీల్దార్, ఆలూరు

మహానందీశ్వరుడికి అన్నాభిషేకం


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామికి ఆదివారం అర్ధ రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల వరకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో ఆర్జిత్రస్వ పూజలు జరిగాయి. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. రెండువేల కిలోల అన్నాన్ని మడితో తయారు చేయించి పూజించారు. గణపతిపూజ, పీఠార్చనలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అన్న ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అలాగే భోగి సందర్భంగా సాయంత్రం చిన్నారులకు సామూహిక భోగిపళ్ల కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి బళ్లారి వాసి మృతి

- ఇద్దరికి గాయాలు


చంద్రశేఖర్

ఆలూరు రూరల్: దైవ దర్శనానికి వెళ్లి వస్తూ.. బైక్ అదుపు తప్పి కింద పడిన ప్రమాదంలో బళ్లారికి చెందిన గాజుల చంద్రశేఖర్ (57) మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి పట్టణంలోని రాఘవేంద్ర నగర్‌కు చెందిన చంద్రశేఖర్, సోదరుడు వీరేష్‌తోపాటు కుమారుడు గీతేష్ బైక్‌పై పత్తికొండ మండలంలోని పులికొండ రంగస్వామి దైవదర్శానికి సోమవారం ఉదయం వెళ్లారు. దైవ దర్శనం అనంతరం సాయంత్ర స్వగ్రామానికి బయలుదేరారు. పెద్దహోతూరు గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బండరాళ్లకు బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో చంద్రశేఖర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరేష్, గీతేష్ స్వల్పంగా గాయపడ్డారు. చంద్రశేఖర్‌ను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడికి భార్య నాగమణి, కూతురు శబరి ఉన్నారు.

మా కుమారుడి ఆచూకీ తెలపండి

- నాయకల్లుకు చెందిన వృద్ధ దంపతులు


ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనకు చేస్తున్న బాధిత దంపతులు రాజన్న, లక్ష్మీనారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్): ఉలిందకొండ పోలీసుల వేధింపులతోనే తమ కుమారుడు రవికుమార్ వారం రోజులుగా కనిపించకుండా పోయారని, అతడి ఆచూకీ కనిపెట్టాలని కోరుతూ కల్లూరు మండలం నాయకల్లుకు చెందిన దంపతులు రాజన్న, లక్ష్మీనారాయణమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ఆందోళనకు దిగగా ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీన తన కుమారుడు రవికుమార్, భార్య భారతితో పొలంలో గొడవ పడినట్లు చెబుతున్నారన్నారు. ఆ తరువాత ఆమె అదేరోజు హంద్రీనీవా కాలువలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారని, అయితే ఇంత వరకు ఆమె ఆచూకీ కనిపించలేదన్నారు. ఈక్రమంలో ఈ నెల 7న విచారణ కోసం పోలీసులు తన కుమారుడిని పిలిపించి అతనే హత్య చేశాడని వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆ మరుసటి రోజు నుంచి తమ కుమారుడు కనిపించకుండా పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. వృద్ధ దంపతులకు మద్దతుగా ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు రాజు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, బీసీ సంఘాల నాయకులు శేషఫణి నిలిచారు.

టీడీపీ నాయకుల దుశ్చర్య


రస్తా కోసం పొగాకు పంటను తొలగించిన దృశ్యం

సాక్షి టాస్క్ ఫోర్స్: టీడీపీ నాయకులు దుశ్చర్యకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన పొలంలో రస్తా లేకున్నా దౌర్జన్యంగా పంటను తొలగించుకుంటూ పోయారు. బాధితులు తెలిపిన వివరాలు.. అవుకు మండలం మారుమడుగుల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉల్లమ్మగారి రామక్రిష్ణారెడ్డి, మద్దిలేటి రెడ్డి, కంబిరెడ్డిలకు 14.47 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత భూమిని అదే గ్రామానికి చెందిన కొందరికి కౌలుకు ఇచ్చారు. అయితే వైఎస్సార్‌సీపీ నాయకుల పొలం దాటిన తరువాత టీడీపీ నాయకుల పొలం ఉంది. వైఎస్సార్‌సీపీ నాయకుల పొలంలో రస్తా లేకున్నా.. టీడీపీ నాయకులు దౌర్జన్యంగా పొగాకు పంటను తొలగించుకుంటూ వెళ్లారు. దీంతో టీడీపీ నాయకులు దుశ్చర్యతో తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కౌలు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

భోగి మంటల్లో అమిత్‌షా చిత్రపటాలు


భోగి మంటల్లో అమిత్‌షా చిత్ర పటాలను దహనం చేసిన నేతలు

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమానించడం దారుణమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. సోమవారం తెల్లవారుజామున స్థానిక వేదిక కార్యాలయం ముందు భోగి మంటల్లో అమిత్‌షా చిత్రపటాలను వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాలు, పీడిత ప్రజల కోసం నిలబడిన అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. అంబేడ్కర్ కేవలం ఎస్సీల కోసం మాట్లాడలేదని, అణచివేతకు గురవుతున్న ప్రజలందరి కోసం ఆయన రాజ్యాంగం రచించారన్నారు. అంబేడ్కర్ గురించి హేళనగా మాట్లాడిన వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కులాల ఐక్యవేదిక కన్వీనర్ టీ శేషఫణి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వై రాజు, మహిళా నాయకురాళ్లు పాలెం రాధ, హుసేన్‌బీ, కాశీంబీ, పద్మావతి, లక్ష్మేశ్వరి, షేకూన్‌బీ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక 'భోగిపండ్లు'


చిన్నారులకు భోగిపండ్లను పోస్తున్న దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని సామూహిక భోగిపండ్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులతో పాటు గుంటూరు, హైదరాబాద్, తణుకు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల చిన్నారులకు పండ్లు పోసి ఆశీర్వదించారు. ముందుగా అర్చక స్వాములు, వేదపండితులు సంకల్పాన్ని పఠించి, గణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోపచారపూజలు జరిపిన తరువాత రేగి పండ్లను, చెరకు గడలను, పూలరేకులతో కలిపి ఐదేళ్లలోపు చిన్నారుల తలపై పోశారు. భోగిపండ్ల కార్యక్రమం ద్వారా పిల్లలకు దృష్టి దోషాలు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని భక్తుల నమ్మకం. కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థాన టోల్‌గేట్ సిబ్బందిపై వేటు

- ఆకస్మిక తనిఖీల్లో సిబ్బంది వద్ద అదనపు డబ్బు
- ఎనిమిది మందిపై వేటు వేసిన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన టోల్‌గేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై వేటు పడింది. టోల్‌గేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వద్ద ఉండాల్సిన డబ్బు కంటే అదనపు డబ్బును అధికారులు గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. శ్రీశైలంలోకి వచ్చే ప్రతి వాహనం నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి రుసుము వసూలు చేస్తారు. అయితే దేవస్థాన అధికారులు ఈనెల 5వ తేదీన ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా సిబ్బంది వద్ద ఉండాల్సిన డబ్బు కంటే అదనంగా ఉండడంతో విచారణ చేపట్టారు. టోల్‌గేట్‌లో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగి ఎం.రామకృష్ణుడు (హెల్పర్), కాంట్రాక్ట్ సిబ్బంది బి.నాగపరమేశ్వరుడు, జి.మల్లికార్జునరెడ్డి, ఎస్.గోవిందు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బి.మల్లికార్జునరెడ్డి, బీ.ఆర్.మల్లేశ్వర్ రెడ్డి, జి.శ్రీనివాసులు, డైలీ వైజ్ సిబ్బంది కె.కె. రాజుపై టోల్‌గేట్ ఇన్‌చార్జ్ అధికారి నివేదికను తయారీ చేసి దేవస్థాన ఈఓకు శ్రీనివాసరావు అందజేశారు. ఆయన పరిశీలించి ఎనిమిది మంది టోల్‌గేట్ సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో ప్రత్యామ్నాయంగా ఇతర సిబ్బందిని టోల్‌గేట్‌లో నియమించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


మనోహర్(ఫైల్)

పాములపాడు: గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని వేంపెంట గ్రామానికి చెందిన మంలో సోమవారం చోటుచేసుకుంది. వేంపెంట గ్రామానికి మనోహర్(49) పంచలింగాల గ్రామంలోని పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. భార్య సుభద్రమ్మ పాములపాడు తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. వీరు కర్నూలులో కాపురం ఉన్నారు. కాగా సంక్రాంతి సెలవుల నిమిత్తం ఆదివారం వేంపెంటకు వచ్చారు. రాత్రి స్నేహితులతో చిన్న నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. రాత్రి గుండెపోటుకు గురికావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వేంపెంట గ్రామానికి చేరుకొని మనోహర్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించి తహసీల్దార్ సుభద్రమ్మను పరామర్శించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సర్పంచు మాణిక్యమ్మ, డిప్యూటీ తహసీల్దార్లు పఠాన్‌బాబు, సుప్రియ, సర్వేయర్ భాస్కర్‌లతోపాటు సిబ్బంది, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

కోళ్ల పందెం స్థావరాలపై పోలీసుల దాడులు

- 12 మంది అరెస్ట్
- రూ. 23,500 నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైకులు, కోళ్లను చూపుతున్న ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది

మహానంది: గాజులపల్లె సమీపంలోని బసవాపురం పంట పొలాల్లో కోడి పందేలు ఆడుతున్న 12 మందిని మహానంది పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బసవాపురం సమీపంలోని పంట పొలాల్లో కోళ్ల పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు చేశారు. మహానంది మండలంలోని పలు గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన 12 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 23,500 నగదు, 20 బైకులు, ఒక ఆటో, ఐదు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామని, మరికొందరు పరారయ్యారని, వారి వివరాల కోసం విచారణ చేపట్టామన్నారు.

సిద్ధలింగేశ్వరస్వామి మఠంలో చోరీ

ఆదోని రూరల్: ఈనెల 11న సంతెకూడ్లూరులోని సిద్ధలింగేశ్వరస్వామి మఠంలో అమ్మవారి తాళి బొట్లు, రెండు బంగారు గుండ్లను అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై పూజారి నెరవణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర సోమవారం వెల్లడించారు.

గోళీ'గుడ్డు'..!



కోవెలకుంట్లలోని డాక్టర్ శివారెడ్డి వీధిలో నివాసం ఉంటున్న మహబూబ్‌బాషాకు చెందిన కోడి సోమవారం గోలి కాయ సైజులో గుడ్డు పెట్టింది. నాలుగు రోజుల నుంచి కోడి మామూలు సైజులో గుడ్లు పెట్టింది. ఐదవ రోజు అతి చిన్నసైజులో గుడ్డు పెట్టింది. దీనిపై పశువైద్యాధికారి కృష్ణకుమార్ మాట్లాడుతూ కోడిలో కాల్షియం దాతు లోపం వల్ల చిన్నసైజులో, ఒక్కో సందర్భంగా పెంకు లేకుండా పొరగుడ్లు పెట్టే అవకాశం ఉందని తెలిపారు. – కోవెలకుంట్ల

రాజ్యాంగ పరిరక్షణకు కృషి

కర్నూలు(అర్బన్): సమాజంలోని అణగారిన వర్గాలకు చెందిన న్యాయవాదులందరూ రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా నిలవాలని నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు వై.జయరాజు కోరారు. సోమవారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జయరాజు మాట్లాడుతూ.. విద్యావంతులు, ఉద్యోగులు, మేధావులు, పౌర సంస్థలు రాజ్యాంగ పరిరక్షణకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, న్యాయవాదులు ఏ.మాధన్న, సుబ్బయ్య, చిన్నయ్య, చంద్రుడు, నాగప్ప, రాజేష్ పాల్గొన్నారు.

దారి విషయంలో ఇరువర్గాల ఘర్షణ

- ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడి రామాంజనేయులు

చిప్పగిరి: మండలంలోని బంటనహాలు గ్రామంలో సోమవారం దారి విషయంలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కాజీపురం రామాంజినేయులు తన ఇంటి వద్ద ఉన్న రోడ్డుకు వేసిన రాళ్లను తొలగించాలని అదే గ్రామానికి చెందిన తలారి సురేష్ ఆదివారం కోరాడు. ఈ విషయంలో మాటామాటా పెరిగి రామాంజనేయులు చెప్పుతో తలారి సురేష్‌పై దాడికి దిగాడు. ఇదే విషయమై సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో తలారి సురేష్ వర్గం కాజీపురం రామాంజనేయులుపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం తరలించగా డాక్టర్లు కర్నూలు పెద్దాస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత


బాధితునికి సెల్ ఫోన్ అందజేస్తున్న పోలీసులు

శ్రీశైలం: దేవస్థానం పరిధిలో భక్తుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు టెక్నాలజీ సాయంతో గుర్తించి బాధితుడికి అప్పగించారు. సీఐ ప్రసాద రావు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన భాస్కర్ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థమై ఆదివారం శ్రీశైలం వచ్చారు. ఈక్రమంలో రూ.25 వేల విలువైన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించారు. పడిపోయిన సెల్‌ఫోన్ ఓ భక్తుడు తీసుకెళ్తుండటం గమనించి అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితుడిని సోమవారం స్టేషన్‌కు పిలిచి సెల్‌ఫోన్ అప్పగించడంతో అతడు కృతజ్ఞతలు తెలిపాడు.


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కర్నూలు (అర్బన్): జిల్లా కేంద్రలోని వాసవీ నగర్‌లో ఉన్న యాదవ హాస్టల్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1986 నుంచి ఇప్పటివరకు హాస్టల్‌లో ఆశ్రయం పొంది చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన దాదాపు 300 మంది పూర్వ విద్యార్థులు హాజరై తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరి బాగోగులు మరొకరు తెలుసుకున్నారు. యాదవ హాస్టల్ నిర్మాణంలో భాగస్వాములైన దేవశంకరయ్య యాదవ్, లక్ష్మణదాసు యాదవ్‌లతోపాటు అక్కడ చదువుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన వారిని సన్మానించుకుని ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. తమకు జీవితాన్నిచ్చిన యాదవ హాస్టల్ అభివృద్ధికి సాయం చేస్తామని ప్రతినబూనారు. అందుకు యాదవ కుల సంఘం నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమానికి అతిథులుగా యాదవ సంఘం నాయకులు డాక్టర్ బాలమద్దయ్య యాదవ్, ఏపీ రామయ్య యాదవ్, నాగేశ్వరరావు యాదవ్, శేషు యాదవ్, శేషఫణి యాదవ్ తదితరులు హాజరయ్యారు.